# కుక్కలున్నాయి జాగ్రత్త!



అందే గోపాలకృష్ణమూర్తి

జడ్జీగారు విపరీతంగా సిగరెట్లు కాలుస్తూ, ఉధృతంగా ఆలోచించసాగారు. "ఈ కేసు చూట్టానికి చిన్నదే. అయినా ముద్దాయిని పట్టుకోవడం ద్వారా తన అనుభవాన్నీ, తెలివితేటలనూ, ప్రజ్ఞాప్రాభవాలనూ ప్రజలకు తెలియజేయాలి. దోపిడీలూ, దొంగతనాలూ, హత్యలూ వగైరాలైతే ముద్దాయిల తాలూకు 'క్లూ'లు ఏవో కొన్ని అతిసునాయాసంగా లభిస్తయ్. దోపిడీలు జరిగితే ముద్దాయి తాలూకు గుర్తులూ, ఆనవాళ్ళూ ఏవో ఒకటి ఎవరో ఒకరి ద్వారా బయట పడకమానవు. అలాగే హత్యలు జరిగితే హంతకుల వ్రేలి ముద్రలో, సిగరెట్ పీకలో, బూటు గుర్తులో ఏవో ఒకటి హత్యాప్రదేశంలోగాని, పరిసరాలలోగాని లభించకపోవు. అయితే ఇప్పుడెలా? తనకొచ్చిన కేసు ఎంత చిన్నది?! తన ఇరవై రెండేళ్ళ అనుభవంలోనూ ఇంతటి అతి స్వల్పమైన కేసు గురించి ఇంతసేపు, ఇంత విపరీతంగా ఆలోచించలేదే! అయినా ఇంతటి చిన్న కేసు అసలు తనవరకూ రాకూడదు. పోలీసులే ఏదోవిధంగా ముద్దాయిని నిర్ణయించేయాలి? ఊళ్ళో కోడి పెట్టలు పోవడమేవిటి, దానికి కోర్టులో ముద్దాయిని నిర్ణయించడ మేవిటీ? రోడ్లు సర్వేచేసే పోలీసులకే ఈ వ్యవహారంలో

ఎక్కువ అనుభవ ముండడానికి అవకాశం హెచ్చు. అందులోనూ పరిష్కారం దొర కని కేసులను పాత కేడీల మీదే బనా యించి, కోర్టు వ్యవహారాలను సులభ సాధ్యం చేసే నేర్పు, చాకచక్యం పోలీసు డిపార్టుమెంట్‌కే కదా పుట్టుకతో వచ్చిన విద్య! అటువంటిది తనేం నిర్ణయించ గలడు?"

ఆలోచనలతో సతమతమైపోసాగారు జడ్జీగారు. ఇంతలో ఫోను అదేపనిగా మ్రోగనారంభించింది.

"యస్, సెషన్స్ జడ్జి రామనాధం స్పీకింగ్........ఆఁ, ఆఁ, హలో, గుడ్ మార్నింగ్....ఎస్. పీ. గారా—ఓహ్.... డిన్నరా?....రేపే....ఉహూఁ! . మెనూ ఏవిటీ?....'వెట్' పార్టీయేనన్నమాట?. ... వెరీ గుడ్—అంతా 'చికెన్' మయమే?... నాకేమి ఇష్టమంటారా? ...'చికెన్—లెగ్ ఫ్రై'....సరే, చూద్దాం—మినిమమ్ ఒన్ డజన్ లెగ్స్—ఆఁ—చూస్కోండిమరి... ఓ యస్స్—థేంక్యూ, థేంక్యూ!... భలే వారే! రేపు సాయంత్రం ఆరింటికల్లా వచ్చే యనూ? ఓ. కే."

ఫోన్‌లో మాట్లాడేసేక జడ్జీగారు హాయిగా నవ్వుకొన్నారు. "చాలా చిత్రంగా వుందే! కోడిపెట్టల దొంగలను నిర్ణయించే వ్యవహారం మీద తను ఆలోచనలు సాగి స్తుంటే కోడిపులావు, కోడి 'ఫ్రై' లతో కూడుకొన్న 'విందు భోజనం'-కాదు,మందూ భోజనాలకు ఆహ్వానంరావడం చాలా చిత్ర మైన కోయిన్సిడెన్సు! సరే, ఇక ఈ వ్యవహా రాన్ని గూర్చి బుర్ర పాడుచేసుకోవడం వృధా। రేపు పార్టీలోనే కోడిపులావు ముగించేక, కోళ్ళ దొంగను గురించి ఎస్. పీ. తో చర్చించి, అక్కడే నిర్ణయించుకో వచ్చు" ననుకొని వేరే పని మీద బైటకు వెళ్ళిపోయారు జడ్జీగారు.

* *

ఎస్. పీ. గారి ఆఖరమ్మాయి రజస్వల అయిన సందర్భంగా, భారీ ఎత్తున— నగరంలోని 'బిగ్‌షాట్స్'. కు యేర్పాటు చేయబడిన 'బూజ్‌పార్టీ'. కలెక్టరూ, డిప్టీ కలెక్టరూ, తాసిల్దారూ, సూపర్నెంటులూ, సి. ఐ. లూ., ఎస్సైలూ, పెద్ద పెద్ద వ్యాపార సంస్థల యజమాన్లూ, సినిమా థియేటర్ల ప్రొప్రయిటర్లూ, వీరందరి తాలూకు హైక్లాసు ఆడమనుషులూ, వారి వారి చిన్న పిల్లలను ఎత్తుకున్న పనిమను షులూ, పనిమనుషుల చిరిగిపోయిన పవిట చెరగులను పుచ్చుకుని వ్రేళ్ళాడుతూ వచ్చిన పనిమనుషుల చీమిడి ముక్కు, చింపిరి జుత్తు పిల్లలూ, విపరీతమయిన బందోబస్తు చేసేస్తూ, పై అధికారి అనబడే ప్రతివాడికీ ఛెయ్యి ఎత్తి సెల్యూట్ చేస్తున్న పోలీసు జవాన్లూ (వారి ఆడమను షులు లేరు) ఒకరేమిటి, ఊళ్ళో పేరున్న వాడూ, కారున్నవాడూ — అంతా ఆ ఉత్సవం తాలూకు విందు భోజనాన్కి హాజరైపోయారు.

హోదాలను బట్టి విందు స్థలాలను వేరు చేసేరు. ఎస్. పీ. గారు. అసిస్టెంట్



సూపర్నెంట్ లగాయితూ పైవారందరికీ తమ మేడ మీద ఆరుబయట ఖరీదైన 'గార్డెన్ చైర్స్' ఏర్పాటు చేయించేరు. వాటి ఎదురుగా అందమైన చిన్న చిన్న 'టేబుల్స్, వాటి మీద పొడుగాటి సీసాలూ, గ్లాసులూ, సోడా కాయలూ, అందంగా అమర్చారు. వాటి ప్రక్కనే ఘుమ ఘుమ లాడిపోతున్న 'చికెన్ ప్రిపరేషన్లూ'తదితర తినుబండారాలూ సర్దేరు.

'బ్లూ రిబ్బన్ జిన్' కి జిందాబాద్ అన్నారు. 'ఓల్డ్ టేవర్న్ విస్కీ' 'వహ్వా' అన్నారు. 'గో యేహెడ్ విత్ గోల్డెన్ ఈగిల్' అని 'బీర' కాయలను పగల కొట్టేరు. 'డ్రై ట్రిప్లెక్స్ రమ్మ' న్నారు. ఆనక 'చికెన్ లెగ్స్' ఏవీ? అన్నారు. అవీ 'వండ్రఫుల్' అన్నారు.

"జడ్జీగారికి మరో రెండు వడ్డించు, అహ్హహ్హ!" అన్నారు ఎస్. పీ. గారు.

"థేంక్యూ" అంటూ నే జడ్జీగారు, "చూడండి సూపర్నెంటుగారూ! చికెన్ ఫ్రై ఈజ్ వండ్రఫుల్! అయితే ఈ మధ్య మన ఊళ్ళో జరుగుతున్న కోడి పెట్టల చోరీ మీద బనాయించిన కేసులో రేపు జడ్జిమెంటు ఈయవలసి ఉన్నది. ఈ సందర్భంలోనే ఆ కేసు విషయమై మీ సలహా ఇస్తే బావుంటుంది. ఏమంటారు?" అని ఎస్. పీ. గారి వైపు తిరిగారు.

"అహ్హహ్హ!" అన్నవ్వేరు ఎస్. పీ. గారు. ఆనక "అయ్యో, అది మనం ఆలో చించడం అనవసరం. జంతువులూ, పక్షులూ వగైరాల దొంగతనం కనుక మన మానవమేధస్సును అటువంటి చిన్నచిన్న

కేసుల పరిష్కారానికి వినియోగించడం అనవసరం. మొన్ననే హైద్రాబాద్ నుండి రెండు జమాజెట్టీల్లాంటి పోలీసు కుక్కలను తెప్పించాను. ప్రస్తుతం అవి నా వద్దనే ఉన్నయ్. వాటి నొక్కసారి ఒదిలేస్తే ఈ కోడిపెట్టల దొంగ వెధవలను క్షణాల్లో పట్టేయ గలవు. మీరేమీ ఆట్టే శ్రమ పడకండి''అన్నారు ఆయాసపడుతూ.

''లేదు, ఆలస్యం జరిగేందుకు వీల్లేదు. ఆ కేసులో ముద్దాయెవరో రేపుదయం లోపలే తెలిసిపోవాలి. రేపు నేను జడ్జిమెంటీయాలంటే ఇది ఈరాత్రే తేలిపోవాలి. ప్లీజ్ హెల్ప్ మీ విత్ యువర్ డాగ్స్!'' అని ప్రాధేయపడ్డారు జడ్జీగారు.

ఎస్ పీ. గారు వెంటనే సి. ఐ.గార్ని పిల్చారు. ఆనక సి. ఐ. గారు 'ఎస్సయ్యా' గార్ని పిల్చారు. ఎస్సైగారు 'హేడ్' ని పిల్చారు. 'హేడ్' గారు 'జమానుగార్ని' పిల్చారు. పది నిముషాల్లో రెండు భయంకరమైన పోలీసు కుక్కలు ఆ 'సీను' లో కొచ్చినయ్. ఎక్కువగా కోడిపెట్టలు దొంగిలించబడిన ప్రాంతంలోని పెద్దమనుషులకు అర్జెంటు కబుర్లు అప్పటి కప్పుడే వెళ్ళిపోయినయ్.

'బిగ్ షాట్స్' డిన్నరు అరగంట తర్వాత పూర్తయిపోయింది. ఎస్. పీ. గారు పోలీసు కుక్కల ప్రతిభా విశేషాలను ఏకరువు పెడుతూ ఆడియన్స్‌ను ఆశ్చర్యపరుస్తున్నారు. ఇంతలో కోడిపెట్టలను విపరీతంగా కోల్పోయిన నలుగురు పెద్దమనుషులు వినయంగా ఎస్. పీ. గారి ముందు హాజరుపెట్టబడ్డారు.

''నావి ఈ మూడు నెలలలోనూ పదహారు పెట్టలూ, అయిదు పుంజులూ పోయినయ్ సార్!''

''నావి ఈ ఒక్క నెలలోనే ఇరవై పై చిలుకు పోయినయ్ సార్, మా బావమ్మర్ది తాలూకు ఎనిమిది పందెంపుంజులు పత్తా లేకుండా పోయినయ్ సార్!''

''మా జీవనాధారమే ఆ కోళ్ళు సార్. జనవరి నుండి ఈ రోజు వరకూ పాతిక పైగా మాయమై పోయినయ్ సార్!''

''అయ్యా అయ్యా, నా వెన్ని పోయినవో, నాకే గుర్తు లేదుగాని, ఈ సంచిలో ఈకలూ, కాళ్ళూ-ఇందాక మా తోడల్లుడు మన సందుమొగలోవి అనుమానం మీద పట్టుకొచ్చేడు సార్. అవన్నీ మా తాలూకు కోడిపెట్టలవేనని నేను ఖచ్చితంగా చెప్పగలను బాబూ! ఆ దొంగ ముండాకొడుకెవడో తమరి ఇంటి చుట్టుప్రక్కలే ఉండుంటాడు సార్! సచ్చి తమరి కడుపున పుడ్తాను, తమరే ఎలాగో ఓలాగ యీ అన్యాయం అపుజేయాలి సార్!''

నలుగురు పెద్దమనుషులూ ఏకరువు పెట్టారు. ఎస్. పీ. గారు శ్రద్ధగా అంతా విన్నారు. 'చూసేవోయ్!' అన్నట్టు జడ్జీగారు ఎస్పీ వైపుచూశారు. ఎస్పీ కళ్ళల్లో నలుగురు పెద్దమనుషులకూ సానుభూతి ద్యోతకమైంది. 'తప్పకుండా సూపర్జెంటుబాబు మమ్మల్ని రక్షిస్తాడు!' అనుకొంటున్నట్టుగా నలుగురూ చేతులు నలుపుకోసాగారు.

ఉన్నట్టుండి జడ్జీగారు బ్రేవ్‌మని తేన్చి, 'వండ్రఫుల్ ఐడియా' అన్నారు ఉత్సాహంగా. 'వాటీజిట్?' ప్రశ్నించారు ఎస్పీగారు. "మీ కెవరిమీదైనా అనుమానంగా వుందా?" అని పెద్దమనుషులను ప్రశ్నించారు.

"ఉంది బాబూ వుంది, అప్పన్న అని-మా యీధిలోనే వుంటాడు. ఆడి కీ అలవాటుంది బాబూ! నా అనుమానం ఆడిమీదే మరి. కాపోతే ఆడి స్నేహితుడెవరైనా ఈ సందు మొగలోగాని వున్నాడేమో నాకు తెలీదు బాబూ!" అన్నాడు అందర్లోకీ పెద్దగా వున్న పెద్దమనిషి.

"అప్పన్న అనేవాణ్ణి అయిదు నిముషాల్లో పట్టుకురండోయ్ పోలీసులూ!" అన్నారు జడ్జీగారు ముందుగా.

ఆరో నిముషానికి అప్పన్న సీనులో ప్రవేశపెట్టబడ్డాడు. ఎస్పీగారు వాణ్ణి ఎగాదిగా చూసి, "అలా చూస్తావేంరా, వెధవ కోళ్ళు పట్టే వాటం నువ్వాను!" అని చీదరించుకున్నారు.

జడ్జీగారు గర్వంగా నవ్వుకొన్నారు. ఒకసారి మీసాలు తడుముకొన్నారు. ఎస్పీగారి వైపు చూస్తూ "చూడండి, ఈ నలుగురిలోనూ ఈ చివ్వరి ఆసామీ సంచిలో తెచ్చిన కోడికాళ్ళూ, ఈకలూ మన పోలీసు కుక్కలకు వాసన చూపుదాం. ఆనక వాటిని విచ్చల విడిగా ఊళ్ళో వదిలేద్దాం. ఆ ఈకల తాలూకు కోళ్ళు ఎక్కడ చంపబడినవో, అక్కడి మనుషుల జాడ మనం ఈజీగా తెల్సికోగలం. ఎలావున్నదీ ఐడియా? ఈ కుక్కలు ఆ మనుషులనుగానీ, మనిషిని గానీ అతి సులభంగా పట్టుకోగలవనే నమ్మకం నా కున్నది. రావయ్యా, 'ఏదీ నీ సంచీ?" అంటూ, పెద్దమనిషి దగ్గరి సంచిని అంది పుచ్చుకున్నారు.

పోలీసు కుక్కలకు సంచిలో సామాను వాసన చూపడం జరిగింది. అవి నాలుకలను గజం పొడుగున పైకి వ్రేలాడదీసి, ఒగురుస్తూ, కోపంగా అందరివైపూ ఓ సారి చూసినయ్. అందరి గుండెలూ 'ఝల్లు' మన్నయ్!

కుక్కలు అన్ని దిక్కులకూ ఓసారి చూసి, మెల్లగా నడక ప్రారంభించినయ్. రెండూ అప్పన్న దగ్గరగా వచ్చి ఒక్కక్షణం ఆగినయ్. వణికిపోతున్న అప్పన్నను చూసి అందరూ జాలిగా, భయంగా నిట్టూర్చేలోపలే కుక్కలు రెండూ ఎస్పీగారి ఇంటి లోపలికి పరుగెత్తినయ్. వాటి వెనకే పరుగెత్తి వెళ్ళేరు జడ్జీగారు.

ఎస్పీగారి వంటింటిని చుట్టుముట్టి, వంట జేసిన ఆడమనుషులందరినీ అనుమానంగా చూసి, ముందు చోటకొచ్చి నిలబడి పోయినయ్ రెండు కుక్కలూను! వాటి కెదురుగా-ఎస్పీగారు, జడ్జీగారూ, నలుగురు పెద్దమనుషులూ, అప్పన్నా, జవాన్లూను!

"మనిషి చేయలేని పని మన కప్పగించేరేవిటి? మనిషిలోని మంచి-చెడ్డలను పసిగట్టవలసిన గురుతర బాధ్యత మన భుజస్కంధాల మీద వదిలేయడం ద్వారా



మానవజాతిని కించపర్చుకుంటున్నామేనన్న బాధ వీళ్ళెవరికీ లేనే లేదేమిటి? మనిషిని శిక్షించడాన్కి న్యాయాన్యాయాలను నిర్ణయించే బాధ్యత మనిషిచేత చులకన చేయబడే శునకాలకు వప్పగించబడడం కలికాలపు విడ్డూరం కాకపోతే మరేవిటీ? అయ్యో ఓ మనిషీ! ఆకాశపు టంచులు అవలీలగా దాటి, ఎక్కడో వున్న గ్రహాల ప్రాంగణంలోకి చొచ్చుకుపోగలిగిన నీ మేధస్సు, నీ విజ్ఞానం, తోటిమనుషుల్లోని తప్పొప్పులను గుర్తించగలగలేక పోతున్న దంటే నిజంగా ఆశ్చర్యపడవల్సిందే!"— అనుకొని బాధపడ్తున్నట్టుగా కుక్కలు రెండూ దిక్కులు చూడసాగినయ్.

రెండు నిముషాలు అందరూ నిశ్శబ్దం పాటించారు. ఏదో జ్ఞాపకమొచ్చినటుగా కుక్కలు రెండూ మెడలు విదిలించుకొని, ఒక్క ఉదుటున వెళ్ళి ఎస్పీగారి పంట్లాంను కరిచి పట్టుకున్నయ్!

అందరి కళ్ళూ అంగుళంన్నర బైటి కొచ్చేసినయ్. సంభ్రమాశ్చర్యాలతో కొయ్యబారిపోయారంతా! ఎస్పీగార్కి ఇంచుమించు స్పృహ పోయింది.

"ఇంపాజిబుల్!" గద్దించినట్లు అరిచారు జడ్జీగారు అందరూ ఉలిక్కిపడి తేరుకున్నారు. కుక్కలు మాత్రం జంకలేదు సరిగదా, పట్టుకొంచెమైనా విడువలేదు. సి. ఐ. లూ, ఎస్సైగార్లూ, కంపించి పోసాగారు. హెడ్లూ, కానిస్టేబుళ్ళూ కరెంటు ముట్టుకుంటున్నట్టు వణికి పోసాగారు.

"హౌ ఈజ్ దిస్ పాసిబుల్! నో నో- ఇంపాసిబుల్! ఎస్పీగారు కోడిపెట్టల

దొంగా? సిల్లీ నాన్సెన్స్! ఈ పోలీసు కుక్కలమీద పరువునష్టం దావా వేయిస్తా!" జడ్జీగారు కోపంలోనూ, మైకంలోనూ ఏం మాట్లాడ్తున్నారో వారికే తెలీదు.

కుక్కలు పట్టు ఏమాత్రం విడవలేదు. "ఇతనే కోడిపెట్టల దొంగ!" అని ఖచ్చితంగా చెప్తున్నట్టు, ఎస్పీగార్ని కదలకుండా పట్టేసుకున్నాయ్

"హా? ఎలా ఇది సంభవం? సి. ఐ గారూ, మీకేమైనా పాలుపోతుందా?" నిస్సహాయంగా అడిగారు జడ్జీగారు.

ఉలిక్కిపడిన సి ఐ గారు 'ఎస్సైన్' గారి వైపు తిరిగారు 'ఎస్సైన్గారు' 'హెడ్' గారివైపు తిరిగి అదేవిధంగా ప్రశ్నించారు 'హెడ్'గారు జవానుగారి వైపు తిరిగారు. జవాను 'అప్పన్న'వైపు తిరిగారు

వణుకుతున్న అప్పన్న వణకడం ఆపి, చిర్నవ్వు నవ్వేడు! చిర్నవ్వు నవ్వుతున్న అప్పన్నను చూసి ఉలిక్కిపడ్డారు, ఎస్సైన్గారు ఉలిక్కిపడ్డ ఎస్సైన్నీ, చిర్నవ్వు నవ్వుతున్న అప్పన్ననూ చూసి అదిరిపడి 'అప్పన్నగారూ!' అనేసేరు కంగార్లో, జడ్జీగారు, హెల్ప్‌లెస్‌గా

అప్పన్నగారు మళ్ళీ నవ్వేరు "ఎందుకు నవ్వుతున్నారో చెప్పండి అప్పన్నగారూ? ఎస్పీగారే కోళ్ళ దొంగా? ఎలా? హా? ప్లీజ్!" తల బాదేసుకున్నారు జడ్జీగారు

"నా కేటి ఎరుక బాబూ? ఎప్పుడ్లాగానే కోళ్ళు పట్టినప్పుడు సగం వాటా ఎస్సైన్య్య బాబుగోర్కి హేడుబాబు చేత యిప్పించేస్తాను. ఆనక మరేటీ నా కెరుకనేదు!" అన్నాడు అప్పన్న.

గుడ్లు మిటకరిస్తూ ఎస్సైన్ వైపు చూసేరు జడ్జీగారు గుటకలు మ్రింగుతూన్న ఎస్సైన్గారు "అవున్సార్, మొన్న సి ఐ. గారు మాంచి కోళ్ళు పంపించమంటేనూ " అంటూ తల వంచేసుకొన్నారు వెంటనే తడుంకొంటూ సి ఐ గారు అందుకొన్నారు—"యస్సర్ మరి నా కోసంకాదు, ఫలానా ఫంక్షనుందీ, అన్ని ఏర్పాట్లూ చెయ్యమని ఎస్పీ దొరగారు సెలవిచ్చారు సార్! అంచేత ఎస్సైన్కి ఆ విషయం పురమాయిస్తే ఈ అప్పన్నగాడి దొంగ కోళ్ళను "—ఇక మాట్లాడలేక మౌనం వహించారు సి. ఐ. గారు

జడ్జీగారు నివ్వెరపోయారు! కుక్కలు రెండూ ఎస్పీగార్ని మాత్రం బహు జాగ్రత్తగా పట్టుకున్నాయ్ "తిన్నింటికే వాసాలు లెక్కపెడ్తారా కుక్కల్లారా?!" అన్నట్టుగా నిస్సహాయంగా కూలబడిపోయాడు ఎస్పీగారు.

ఎస్పీగారు 'కోడిపెట్టల దొంగ' అని పోలీసు కుక్కలు పసిగట్టేసినవన్న వార్త ఊరంతా ప్రాకిపోయింది. "బొరా!" అని ప్రజలంతా విస్తుపోయారు. వారిని బహుశ సస్పెండ్ చేస్తారేమోనని వారి వల్ల నష్టపోయిన వ్యాపారస్థులూ, తదితర పెద్ద మనుషులూ ఆశించారు.

మర్నాడు కోర్టు విపరీతంగా కిటకిటలాడి పోయింది. ఎక్కడ చూసినా, ఏనోట



విన్నా ఇదేమాట! సంభ్రమాశ్చర్యాలతో ఆబాలగోపాలం పోలీసు కుక్కల ప్రతిభా విశేషాలను ఒకేరీతిగా చెప్పుకోసాగేరు 'కుక్కలు ఎంతపని చేసినవి!' అని ముక్కు మీద వేలేసుకుని, తియ్యడం మర్చిపోయేరు.

జడ్జీగారు గంభీర ముద్రవహించి నగరంలో జరుగుతున్న కోడిపెట్టలచోరీ విషయం విపులీకరించి, కేసుకు కావల్సిన సాక్ష్యాలూ, ఆధారాలూ అన్నీ వదివివిన్పించి, చివరకు, "ముద్దాయిగా రుజువు చేయబడ్డ వ్యక్తిని ఘోరంగా శిక్షించవలసిన అవసరం ఎంతైనా వున్నది అందుచేతనే ముద్దాయి అప్పన్నకు రెండు సంవత్సరాలు కరినశిక్ష విధిస్తున్నాను!" అంటూ లేచి వెళ్ళిపోయారు

కోర్టంతా కోలాహలంతో నిండిపోయింది! "కుక్కలు మూపిన న్యాయానికీ. మనిషి చెప్పిన న్యాయానికీ ఎంత తేడా?" అనేది సందేహంగానే నిల్చిపోయింది

"పాపాన్ని చేసినవాడు అప్పన్న ఫలితాన్ని అనుభవించిన వాడూ అప్పన్నే! అయితే 'ఫలాన్ని' అనుభవించినవాడు ఆఫీసరుబాబు కూడా! న్యాయాన్ని అన్యాయంగానూ, అన్యాయాన్ని న్యాయంగానూ మార్చి చూపగల మహత్తరశక్తి మనిషికున్నది. న్యాయాన్ని కేవలం న్యాయంగానే చూపించే అలవాటు కుక్కకున్నదని నిరూపించినయ్ 'ఎస్పీ'గారి కుక్కలు! అందుకే గామోసు, గొప్పగొప్ప వారంతా 'కుక్కలున్నాయి జాగ్రత్త!' అని పెద్ద పెద్ద బోర్డులు తగిలిస్తుంటారు!" అనుకొంటూ అక్కడి నుండి నిష్క్రమించారు, అప్పన్న మీద సానుభూతి చూపిన ప్రజలు.